క్లుప్తంగా

కుటుంబ సర్వే ప్రారంభం

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలోని పలు డివిజన్లలో కుటుంబాల గుర్తింపు, స్టిక్కర్లు అతికించే ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. ఈమేరకు శనివారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభమైంది. ప్రజల నుంచి సమగ్ర వివరాలను ఎన్యుమరేటర్లు సేకరించారు. మొదటి రోజు సమగ్ర సర్వే ప్రశాంతంగా సాగింది. కార్యక్రమంలో కార్పొరేటర్లు ముస్కమల్ల అరుణ, దిడ్డి కుమారస్వామి, సువర్ణ, ఉమ, గద్దె బాబు, మరుపల్లి రవి, పల్లం పద్మ, ఈదుల అరుణ, గుండు చందన తదితరులు పాల్గొన్నారు.

అంజన్నకు లక్షపూలతో ప్రత్యేక అలంకరణ



కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీమార్కెట్‌లో దక్షిణముఖంగా కొలువుదీరిన అభయాంజనేయ స్వామికి భక్తులు లక్ష పూలతో శనివారం ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల పర్యవేక్షణలో పూలతో అలంకరించారు. కార్తీక మాసోత్సవాన్ని పురస్కరించుకుని దేవాలయ ప్రధాన పూజారి జూగర్లపూడి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలతో పాటు అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు మహాన్నదానం చేశారు.

22న అంబేడ్కర్ భవన్‌లో విద్యార్థి యుద్ధభేరి మహాసభ

నయీంనగర్: సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలకు మెస్ చార్జీలు పెంచాలని, సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న అంబేడ్కర్ భవన్‌లో విద్యార్థి యుద్ధభేరి మహాసభ నిర్వహించనున్నట్లు తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కూరెళ్ల మహేష్‌కుమార్ తెలిపారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 22న హనుమకొండ అంబేడ్కర్ సెంటర్ నుంచి అంబేడ్కర్ భవన్ వరకు వందలాది మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించనున్నట్లు వివరించారు. అనంతరం సభ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో సత్యనారాయణ, మేడి రాజు, గోవిందరాజు, నవీన్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి



హసన్‌పర్తి: ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానని సంఘం జిల్లా అధ్యక్షుడు తోట సురేష్ అన్నారు. అధ్యక్షుడిగా సురేష్, ప్రధాన కార్యదర్శిగా మోహన్ ఎన్నికైన అనంతరం తొలిసారిగా హసన్‌పర్తికి వచ్చిన సందర్భంగా వారిని ఆర్యవైశ్య సంఘం హసన్‌పర్తి శాఖ సభ్యులు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ నిరుపేద ఆర్యవైశ్యులకు చేయూతనిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం హసన్‌పర్తి మండల శాఖ అధ్యక్షుడు చకిలం రాజేశ్వరరావు, సంఘం సభ్యులు నాగమళ్ల సుధీర్, గౌరిశెట్టి కృష్ణమూర్తి, వెలగందుల భీష్మనాథం, నాగేందర్, ప్రకాష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా గోవులను తరలిస్తున్న ఐదుగురిపై కేసు

కాజీపేట: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఓ టాటాఏస్ వాహనంలో గోవులను తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులపై కాజీపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్సై శివకృష్ణ కథనం ప్రకారం బాపూజీనగర్ ప్రాంతంలో ఏఎస్సై శ్రీధర్ పెట్రోలింగ్ చేస్తుండగా అందిన సమాచారం మేరకు పోలీసులు దాడిచేసి వాహనంలో తరలిస్తున్న గోవులను పట్టుకున్నారు. ఆ గోవులకు పశువైద్యాధికారితో పరీక్షలు చేయించి గోశాలకు అప్పగించారు. గోవులను తరలిస్తున్న బాలిరెడ్డి, బాబురావు, రాజేష్, ఇమ్రాన్, పాషాపై కేసు నమోద్ చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పీహెచ్‌సీ తనిఖీ



హసన్‌పర్తి: హసన్‌పర్తిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యారోగ్యాధికారి డాక్టర్ అల్లెం అప్పయ్య శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వార్డులు, లాబోరేటరీ రూంలను పరిశీలించి, రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ మహేందర్, సీహెచ్‌ఎల్ మేరినా, సూపర్‌వైజర్ రుతమ్మ, లచ్చు, ఫార్మసిస్ట్ అజిత్, స్టాఫ్ నర్స్ విజయకుమారి, రేణుక, ల్యాబ్ టెక్నీషియన్ జనార్దన్, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విలీన కాలనీల్లో సమస్యల తిష్ట

- సమస్యలతో 43వ డివిజన్ వాసుల సహవాసం
- రోడ్లు, డ్రెయినేజీలు లేక ఇబ్బందులు
- దోమల బెడద, పందుల స్వైర విహారం
- పట్టించుకోని అధికారులు, పాలకులు



మట్టిరోడ్డుపై నిలిచిన మురుగునీరు



డ్రెయినేజీలు లేని గణేష్‌నగర్ కాలనీ

ఖిలా వరంగల్: శివారు కాలనీలపై అధికారులు, పాలకులు దయచూపడం లేదు. ప్రజలు సమస్యలతో సహవాసం చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. స్వరాష్ట్రం ఏర్పడి 10 ఏళ్లు దాటినా.. పాలకులు మారుతున్నా తమ బతుకులు మారడం లేదని ఆయా కాలనీల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల వద్ద సమస్యలపై ఏకరువు పెట్టినా జాలి చూపడం లేదని వాపోతున్నారు.

సమస్యలతో సతమతం

43వ డివిజన్ పరిధిలోని విలీన కాలనీలైన సాయినగర్, సత్యసాయి నగర్, శ్రీనివాస, వేంకటేశ్వర కాలనీ, రహీమత్‌నగర్, గణేష్‌నగర్ కాలనీల్లో అభివృద్ధి లేక సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయి. ఆయా కాలనీల్లో అన్నివర్గాల ప్రజలు నివాసం ఉంటున్నారు. నగరంలో గ్రామీణ ప్రాంతాలు విలీనమై ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధి లేక సమస్యలతో ప్రజలు సతమతం అవుతున్నారు. రోడ్లు, డ్రెయినేజీలు, పారిశుద్ధ్య సమస్యలతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. దోమలతో వ్యాధుల బారిన పడుతున్నారు. తాగునీరు సరఫరా అంతంత మాత్రంగానే ఉంది. వర్షాకాలంలో రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. వేసవి కాలంలో దుమ్మూధూళితో కాలనీల వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిషన్ భగీరథ పైపులైన్ల కోసం అంతర్గత రోడ్లను తవ్వి అలాగే వదిలేయడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్‌కు మొరపెట్టుకున్నా తమను పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో మురుగునీరంతా రోడ్లపైనే పారుతోందని చెబుతున్నారు. ఖాళీ స్థలాల కారణంగా పందులు స్వైర విహారం చేస్తున్నాయని వాపోతున్నారు.

మా బతుకులు బాగుచేయాలి



నగరంలో విలీనమైన శివారు కాలనీలను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. అభివృద్ధికి దూరంగా, కనీస సౌకర్యాలు లేక దుర్భర జీవనం గుడుపుతున్నాం. ప్రధాన రోడ్డు నుంచి కాలనీకి వెళ్లడానికి ఇప్పటికీ సరైన రోడ్లు లేవు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి మా బతుకులు బాగు చేయాలి.

– రంగరాజు అనిత, వెంకటేశ్వర కాలనీ

అభివృద్ధిపై దృష్టి సారించాలి



గణేష్‌నగర్ కాలనీలో సరైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వేళాపాల లేని నీటి సరఫరాతో ఇక్కట్లు తప్పడం లేదు. అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. అస్తవ్యస్తమైన డ్రెయినేజీతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గణేష్‌నగర్ అభివృద్ధిపై దృష్టి సారించాలి.

– గుగులోతు విజయ్, గణేష్‌నగర్

13న సప్తధామంలో సత్యనారాయణ వ్రతాలు



వ్రతాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ట్రస్టీలు

వరంగల్: నగరంలోని 3వ డివిజన్ ఆరెపల్లి సమీపంలోని సప్త గురుధామంలో ఈనెల 13వ తేదీన సామూహిక శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాన్ని 251 మంది జంటలతో నిర్వహించనున్నట్లు శివానందగురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ గోపీచంద్ తెలిపారు. గురుధామంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని సద్గురు శివానంద మూర్తి దివ్య ఆశీస్సులతో గత 12ఏళ్ల నుంచి నిర్వహిస్తున్నట్లు వివరించారు. వ్రతాల్లో పాల్గొనే జంటలకు అన్ని పూజా ద్రవ్యాలతో పాటు పూలు, పండ్లు ఇతర సామగ్రిని ట్రస్ట్ తరఫున ఉచితంగా సమకూర్చనున్నట్లు తెలిపారు. మరో ట్రస్టీ బండారు సాయి నారాయణ మాట్లాడుతూ వ్రతాల్లో పాల్గొనే దంపతులు తప్పనిసరిగా సంప్రదాయ దుస్తుల్లో రావాలని, ఏమి తినకుండా స్నానం చేసి ఇంట్లో పూసిన పూలు తీసుకొని రావాలని అన్నారు. రిజిస్ట్రేషన్ లేని వారికి స్పాట్ రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. అనంతరం సమష్టి వ్రతాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రస్టీలు మాదారపు సదాశివుడు, రేపాల రామచందర్, గందె ఉమాశంకర్, పబ్బతి నరేష్ పాల్గొన్నారు.

11 నుంచి 17 వరకు కార్తీక మాస వారోత్సవాలు



హన్మకొండ కల్చరల్: ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు హనుమకొండలోని భవాని మాత దేవాలయంలో నిర్వహించనున్న కార్తీకమాస వారోత్సవాలను విజయవంతం చేయాలని టీటీడీ కార్యక్రమ నిర్వాహకుడు రామిరెడ్డి కృష్ణమూర్తి కోరారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం హనుమకొండ భవానీనగర్‌లోని భవాని మాత దేవాలయంలో ఆయన మాట్లాడారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కార్తీక పురాణ సప్తాహ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతీరోజు సాయంత్రం 6.30 గంటల నుంచి 8గంటల వరకు ప్రవచన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో వంగల సోమయాజులు, శ్రీహరి సనత్‌కుమార్, తెన్నేటి వసుంధర, వనపర్తి రఘువీర్‌రావు, లక్ష్మారెడ్డి, కలకుంట్ల మురళీధర్ రావు, రాజమౌళి, నరసింహమూర్తి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాడాలి



జెండాను ఆవిష్కరిస్తున్న మంద నరేష్

కేయూ క్యాంపస్: విద్యారంగ సమస్యలపై పోరాడాలని ఏబీఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ కోరారు. కాకతీయ యూనివర్సిటీలో ఏబీఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని క్యాంపస్‌లోని లైబ్రరీ వద్ద శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ, సామాజిక, రాజకీయ, కార్మిక, నిరుద్యోగ సమస్యలపై నిత్యం పోరాటం చేస్తూ ఏబీఎస్‌ఎఫ్ ముందుకెళ్తోందని వివరించారు. విద్యారంగ సమస్యలపై పోరాట కార్యాచరణ చేపట్టబోతున్నట్లు వివరించారు. ఏబీఎస్‌ఎఫ్ ఆవిర్భావ సభను ఈనెల 30న కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏబీఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దార సురేష్, కేయూ అధ్యక్షుడు దూడపాక నరేందర్, ప్రధాన కార్యదర్శి బండారి పృథ్వీరాజ్, బాధ్యులు రవి, రమేష్, సాయికిరణ్, గౌతమ్, మధు, చైతన్య, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



వరంగల్: ఏనుమాముల పోలీసుస్టేషన్ పరిధిలోని 100ఫీట్ల రోడ్డు శ్రీనివాసకాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిందని పోలీసు ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు. ఇంటి యాజమాని యాకుబ్‌పాషా వాటర్ ప్యూరీఫయర్ వ్యాపారం చేస్తున్నాడు. ఆయన తన ఇంటికి తాళం వేసి శుక్రవారం తన భార్య, పిల్లలతో బయటికి వెళ్లి సాయంత్రం వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. దాంతో లోపలకు వెళ్లి చూడగా బీరువాలోని ఐదున్నర తులాల బంగారం, అర కిలో వెండిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తికెళ్లినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి క్లూస్ టీం సహాయంతో ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, ఎస్సై శ్రీకాంత్ ఘటనా స్థలాన్ని శనివారం పరిశీలించారు.

కులగణనలో సూపర్‌వైజర్ లేక ఇబ్బందులు



కులగణన చేస్తున్న ఎన్యుమరేటర్లు

దేశాయిపేట: వరంగల్ మండలంలోని 12వ డివిజన్ దేశాయిపేట ప్రాంతాల్లో కులగణనకు వస్తున్న ఎన్యుమరేటర్లపై పర్యవేక్షణ చేసే సూపర్‌వైజర్ లేకపోవడంతో సర్వే నత్తనడకన సాగుతోంది. ఎన్యుమరేటర్లుగా ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలను నియమించడంతో వారు ఫారాలు నింపలేకపోతున్నారు. ఇక్కడ సూపర్‌వైజర్‌గా నియమించిన ఉపాధ్యాయుడికి పర్వతగిరి మండలం అన్నారంలో విధులు కేటాయించడంతో ఈ డివిజన్‌లో పర్యవేక్షణ లేకుండా పోయింది. సర్వేలో అన్ని ప్రశ్నలకు సమాధానం చెబుతున్నప్పటికీ ఒక్కో ఫారం నింపేందుకు గంటకు పైగా సమయం పడుతోందని ఎన్యుమేటర్లు తెలిపారు. ఇంటికి ఒకటి చొప్పున 100 స్టిక్కర్లు అంటించాల్సి ఉండగా అందులో అద్దెకు ఉన్న పేరుపై కూడా అంటించడంతో స్టిక్కర్ల కొరత ఏర్పడింది. కులగణనపై సరైన ప్రచారం కల్పించకపోవడంతో ఇంటింటికి వెళ్లిన ఎన్యుమరేటర్లకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఈక్రమంలో ఎన్యుమరేటర్ల నుంచి నిరసనలు వ్యక్తం అవుతున్నాయి.

20న కాంగ్రెస్ సేవాదళ్ దశాబ్ది ఉత్సవాలు



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

హన్మకొండ చౌరస్తా: ఈనెల 20వ తేదీన హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరగనున్న తెలంగాణ కాంగ్రెస్ సేవాదళ్ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర సేవాదళ్ జనరల్ సెక్రటరీ సుంకరి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండలోని డీసీసీ భవన్‌లో శనివారం జరిగిన సేవాదళ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో సేవాదళ్ కార్యకర్తల కృషి మరువలేనిదని కొనియాడారు. సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ అధ్యక్షతన జరిగే దశాబ్ది ఉత్సవాలకు జిల్లా నుంచి సేవాదళ్ కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని కోరారు. నకిరేకంటి మోహన్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చర్లకొండ సదానందం, ఆదినారాయణ, కర్ణకంటి అరుణ, పల్లపు యాదగిరి, సురేందర్, దొమ్మాటి రాజేష్, సయ్యద్, సోమయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రీ ఆర్‌డీ క్యాంపునకు విద్యార్థి ఎంపిక



కేయూ క్యాంపస్: కేబీసీ నార్త్ మహారాష్ట్రలోని యూనివర్సిటీలో ఈనెల 12 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న ఎన్‌ఎస్‌ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంపునకు కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన టి.అంజలీదేవి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని పలువురు శనివారం అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షాలు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు తూర్పాటి వెంకటేష్, స్వప్న, కళాశాల సూపరింటెండెంట్ వీరు నాయక్, పివి.వైష్ణవి, మల్లేశం, సంజయ్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కవిత



కవితకు నియామక పత్రం అందజేస్తున్న సురేష్

హన్మకొండ చౌరస్తా: తెలంగాణ బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హనుమకొండకు చెందిన కత్తుల కవిత నియమితులయ్యారు. ఈమేరకు హనుమకొండలో శనివారం జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ సమావేశంలో కవితకు బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపకుడు దాసు సురేష్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ మహిళలు రాజకీయంగా మరింత చైతన్యవంతులు కావాలని సూచించారు. జనాభాలో బీసీల మహిళల ఓట్లు ఎక్కువగా ఉన్నాయని, వారి ఓటుతో రాజ్యాధికారాన్ని సాధించుకోవాలని అన్నారు. సమావేశంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గాజు యుగేందర్, ఏరుకొండ హైమావతి, ముంజాల రాజేందర్, జూలూరి రమేష్, కల్లెబోయిన సురేందర్, తెలంగాణ కొమురయ్య, వీరేందర్, విష్ణు, కుమారస్వామి, మడత కిషోర్, జనార్దన్, కేయూ జేఏసీ నేత వీరబోయిన తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

తుడుందెబ్బ సభల్ని విజయవంతం చేయండి



నయీంనగర్: ఆదివాసీ హక్కుల పోరాటసమితి (తుడుందెబ్బ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరగనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర కన్వీనర్ బుర్స పోచయ్య కోరారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీల హక్కులను అక్రమంగా పొందుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ పోరాటం చేస్తోందని గుర్తుచేశారు. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సభలను నిర్వహించి ఆదివాసీలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 3న హనుమకొండలో ఉమ్మడి వరంగల్ జిల్లా సభలు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు సిద్దబోయిన లక్ష్మీనారాయణ, పుష్పారాణి, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి ముందుకు రావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు కోరారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాత తరగతి గదులను పునరుద్ధరించారు. పాఠశాల పూర్వ విద్యార్థుల సంక్షేమ సంఘం నిధులు సమకూర్చగా ఈ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. సర్కారు పాఠశాల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని చెప్పారు. విద్యకు రాష్ట్రప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. సర్కారు ఏర్పాటైన పది నెలల్లోనే భారీగా ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, సుమలత, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కిరణ్, ఆరెల్లి వెంకటస్వామి, రిటైర్డ్ టీచర్ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎల్.మూర్తి

విద్యారణ్యపురి: రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్.మూర్తి డిమాండ్ చేశారు. హనుమకొండలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలవుతున్నా ఇంకా విద్యారంగ సమస్యలు పరిష్కారం కాలేదని ఆరోపించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నిర్వీర్యమైన విద్యారంగాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పరిరక్షించే చర్యలు కనబడడం లేదని ఎద్దేవాచేశారు. రాష్ట్రంలో సుమారు రూ.8వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. గురుకులాలకు అద్దె చెల్లించకపోవడంతో భవనాల యజమాన్యాలు తాళాలు వేసిన దుస్థితి ఇటీవల చోటుచేసుకుందని అన్నారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, జనరల్ సెక్రటరీ మంద శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు కల్యాణ్, బాధ్యులు పరిమళ, అనూష, జస్వంత్, ఈశ్వర్, హేమంత్, సిద్ధార్థ అరుణ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

‘పాలన చేతకాక పాపపు మాటలు’



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నయీంనగర్: కాంగ్రెస్ నాయకులకు పాలన చేతకాక పాపపు మాటలు మాట్లాడుతున్నరని బీఆర్‌ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌పై కాంగ్రెస్ నాయకుల దిగజారుడు మాటలకు నిరసనగా కాళోజీ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా కుడా మాజీ చైర్మన్లు మర్రి యాదవ రెడ్డి, సుందర్‌రాజ్ యాదవ్‌తో కలిసి వినయ్‌భాస్కర్ మాట్లాడారు. కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడమంటే ఆకాశంపై ఉమ్మి వేయడమే అవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అన్యాయాలు, హామీలను ప్రశ్నిస్తుంటే అక్కసుతో కేసులపాలు చేయాలని చూస్తున్నారని వాపోయారు. మూసీ ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదని, పేదల ఇళ్లను కూల్చివేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. కేసీఆర్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక వ్యక్తిగతంగా విమర్శలు చేస్తున్నారని అన్నారు.

టెమ్రిస్‌కు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలి



విద్యార్థులతో సంఘం బాధ్యులు, ప్రిన్సిపాల్

న్యూశాయంపేట: విద్యలో అత్యున్నత ప్రతిభను కనబరిచి తెలంగాణ మైనారిటీ గురుకులాల విద్యాసంస్థ (టెమ్రిస్)కు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని వరంగల్ శాంతి సంఘం అధ్యక్షుడు డాక్టర్ అనీస్ సిద్దిఖీ సూచించారు. వరంగల్, నర్సంపేట(జి1) బాలికల మైనారిటీ గురుకులంలో ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ప్రతిభ కనబరిచి ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో మొదటి, రెండవ స్థానాల్లో నిలిచిన నలుగురు విద్యార్థులను శనివారం అభినందించారు. ప్రిన్సిపాల్ శ్రీపాల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు గురుకులాలు వరంలాంటివని, వాటిని సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ శ్రీపాల మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజ్‌మహ్మద్, అమ్జద్‌బేగ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కవితల పోటీల్లో ప్రతిభ



ప్రవీణ్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

కాజీపేట అర్బన్: హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో శనివారం తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నిర్వహించిన ప్రజాకవి కాళోజీ స్మారక జాతీయ స్థాయి కవితల పోటీల్లో హనుమకొండ జిల్లా బాలల పరిరక్షణ అధికారి సారం ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. ‘వీడూ మనిషేనట’ అనే కవితాగానంతో ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కు సినీగేయ రచయితలు మౌనశ్రీ మల్లిక్, వెనిగళ్ల రాంబాబు, తెలుగు టెలివిజన్ రైటర్స్ అసోసియేషన్ కార్యదర్శి కర్ర నరేందర్‌రెడ్డి, సినీనటుడు చిత్తరంజన్, కవి వెంకటస్వామి జ్ఞాపిక, ప్రశంసపత్రం అందజేసి సన్మానించారు.